క్లుప్తంగా

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ: నిరుద్యోగులకు రాయితీపై అందించే రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రవర్ణ కులాలకు చెందిన పేదలకు 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉండి, తెల్లరేషన్ కార్డులు కలిగిన వారు అర్హులని తెలిపారు.

అగ్నిగంగమ్మకు మొక్కులు చెల్లింపు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో బుధవారం అగ్నిగంగమ్మ అమ్మవారికి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ప్రతీ ఏటా ఒడిశా రాష్ట్రంలోని నీలావడిలో అగ్నిగంగమ్మ ఉత్సవాలను నిర్వహించిన సమయంలోనే ఉల్లిబద్రలో వెలసిన అగ్నిగంగమ్మ అమ్మవారికి గుడివద్ద డప్పువాయిద్యాలతో తరలివెళ్లి తమ మొక్కులను చెల్లించుకోవడం పరిపాటిగా వస్తుంది. ఈ మేరకు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనులపై దృష్టి

పాలకొండ రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ విజయ రంగారావు అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామ సచివాయ పరిధిలో ఉపాధి పనులతో పాటు పీ–4 సర్వేను బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు.

సారాను సమూలంగా నిర్మూలించాలి

సీతంపేట: సారాను సమూలంగా నిర్మూలించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని మండ గ్రామంలో నవోదయం 2.0 అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా వల్ల కలిగే నష్టాలను వివరించారు. సారా తయారు చేసినా, విక్రయించినా టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్, రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ జైభీమ్, ఎస్సై వై.అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే

భామిని: మండలంలోని లివిరిలో వెలిసిన గోపీనాథా రాధాకృష్ణలను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆమె వెంట స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పొట్నూరు ఉషారాణి, పార్టీ నాయకుడు గెల్లంకి రమేష్, బొడ్డేపల్లి ప్రసాద్, చెప్పల రాములు, పార్టీ నాయకులున్నారు.

ఘన జీవామృతంతో బహుళ ప్రయోజనాలు

భామిని: ఘన జీవామృతంతో భూసారం పెరగడంతో పాటు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి సాగు ఐసీఆర్‌పీ వలరౌతు ప్రభాకరరావు అన్నారు. మండలంలోని నులకజోడులో బుధవారం ఘన జీవామృతం తయారు చేయించడంతో పాటు దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎకరాకు 400 కిలోల ఘనజీవామృతం వేస్తే భూమిలో సూక్ష్మజీవులు పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. 100 కిలోల దేశీ ఆవుపేడ, 2 కిలోల బెల్లం, రెండు కిలోల పప్పుల పిండి, 10 కిలోల దేశీ ఆవు మూత్రంతో కలిపి ఘనజీవామృతం ఉండలు తయారు చేసి నీడలో ఆరబెట్టాలన్నారు. ప్రకృతిసాగు సిబ్బంది కె.సంధ్య, జి.రాంబాబు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: నిరుద్యోగ యువత ప్రముఖ కంపెనీలు నిర్వహిస్తున్న జాబ్ మేళాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద సంఖ్యలో యువత మేళాకు హాజరుకావడం శుభపరిణామమన్నారు. ఈ క్రమంలో అర్హత కలిగిన 19 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు బి.వెంకటేష్, ఎం.చంద్రబాబు, కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, జేకేసీ కోఆర్డినేటర్ పి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అప్రమత్తం

వీరఘట్టం: రైతులు, ప్రజల నుంచి వచ్చే భూసమస్యలపై రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మణనాయుడు, వీఆర్‌ఓలు జి.రాజేంద్రప్రసాద్, బి.శ్రీనివాసరావు, పి.రఘునాయుడు, వి.రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూలు ..



ఐటీడీఏలో అంగన్‌వాడీ సహాయక పోస్టులకు సంబంధించి ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. రేగులగూడ, దిగువబుడగరాయి అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ రెండు పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే భామిని మండలంలోని మాసగూడ కేంద్రం హెల్పర్ పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, సీడీపీఓలు రంగలక్ష్మి, శాంతిభవానీ, వైద్యాధికారి శివశంకర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. – సీతంపేట

● తస్మాత్...



ఒడిశా సరిహద్దు గ్రామమైన కొమరాడ మండలంలోని కూనేరు రైల్వే గేటు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ గేటు దాటి గిరిశిఖర పంచాయతీలైన పూడేసు, మసిమండ, పెదశాఖ, కుంతేస్‌లకు సంబంధించి సుమారు 30 గ్రామాల గిరిజనులు మండల కేంద్రం కొమరాడ వచ్చేందుకు ఈ రైల్వే గేటు దాటాల్సిందే. అయితే ఒక్కోసారి రైల్వే గేటు వేసి వున్నా ఈ గ్రామాల ప్రజల తమ అవసరాల నిమిత్తం నిత్యం దీన్ని దాటేస్తున్నారు. ఇక్కడ మూడు రైల్వే లేన్లు ఉండడంతో నిత్యం ప్రమాదకరంగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి కనీసం ఇక్కడ లో లెవల్ వంతెన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. – కొమరాడ

● ఎండి'నది'



వేసవి ఎండలు మండిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగి రాత్రి పూట మంచు కురుస్తుంది. కొద్ది నెలలుగా వర్షాలు లేకపోవడంతో నదులు ఎండిపోతున్నాయి. నాగావళి, జంఝావతి నదుల్లో నీరు లేక ఎండిపోయాయి. జంఝావతి నది నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని అధికారులు లో లెవల్ కెనాల్‌కు విడిచిపెట్టడంతో పూర్తిగా ఎండిపోయింది. దీని ప్రభావం తోటపల్లి రిజర్వాయర్ మీద పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. –కొమరాడ

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- నాణ్యమైన ఉపకరణాలే మేలు
- వేసవిలో మరింత అప్రమత్తం

గుమ్మలక్ష్మీపురం:

దైనందిన జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో, ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే జరుగుతాయి. రోజు రోజుకు పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులకు తెలియకుండానే నష్టం జరుగుతోంది. చిన్న చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సి వస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

విద్యుత్ వినియోగం, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, వైర్లు అతకడం తదితర పనులు సొంతంగా చేయడం ఏమాత్రం సరైనది కాదు. పైగా చిన్న చిన్న వ్యత్యాసాల కోసం ఆలోచించి ఇళ్లలో వాడే విద్యుత్ ఉపకరణాలు, తీగలు నాసిరకమైనవి తీసుకోకపోవడం ఉత్తమం. వేసవిలో విద్యుత్ వినియోగం విషయంలో కూడా మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండడంతో ఈ సమయంలో అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రధానంగా ఇంటికి వాడే విద్యుత్ తీగలు, పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగినవి మాత్రమే వినియోగించడం వల్ల ప్రమాదాలు అరికట్టవచ్చు. విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజుపై పడకుండా చూసుకోవడం మంచిది. విద్యుత్ వినియోగించే ఉపకరణాలను బట్టి తగిన సామర్థ్యం ఉన్న తీగలు, పరికరాలు వినియోగించాలి. ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే, అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి.



గుమ్మలక్ష్మీపురంలో విద్యుత్ స్తంభంలో లైన్లు పునరుద్ధరణ పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది



విద్యుత్ బల్బ్

అవగాహన లేకే అధిక ప్రమాదాలు

అవగాహన లేకపోవడం వల్లే విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇళ్లల్లో పాత వైరింగ్ ప్రమాదకరంగా ఉంటే తొలగించి కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ పనుల్లో తర్ఫీదు పొందిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే వైరింగ్ చేయించాలి. సరైన ఎర్త్ లేకపోతే కొన్ని ఉపకరణాలు ద్వారా విద్యుద్ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. మూడు పిన్నులున్న ప్లగ్‌లు సాకెట్లను మాత్రమే వినియోగించాలి. ఒకే చోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– ఎస్.రవికుమార్,
విద్యుత్ శాఖ ఏఈ, గుమ్మలక్ష్మీపురం

పెన్షన్లు తొలగించడం అన్యాయం


● మాజీ ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పార్టీ నాయకులు

భామిని: ఎన్నికల ముందు 50 ఏళ్లకే పెన్షన్లు అందజేస్తామంటూ హామీలిచ్చిన చంద్రబాబునాయుడు తీరా అధికారంలోకి వచ్చాక ఉన్న పెన్షన్లు రద్దు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని అనంతగిరిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..దివ్యాంగులను ఆదరించాల్సింది పోయి వారి పెన్షన్లు రద్దు చేస్తామనడం సరికాదన్నారు. పాలకొండ, సీతంపేటలో ఏరియా ఆస్పత్రులున్నా.. వేరే ప్రాంతాల్లో దివ్యాంగ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. భర్త చనిపోయిన నెల రోజుల్లోనే భార్యకు వితంతు పింఛన్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో లక్షలాది మంది వితంతవులుగా మారిన వారు కనిపించడం లేదా అని అన్నారు. పెన్షన్లు రద్దు చేస్తే రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు పొట్నూరు ఉషారాణి, కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్‌లు జామి ప్రభాకర్, బౌరి సొధామిణి, పార్టీ నాయకులు గెల్లంకి రమేష్, మేడిబోయిన చలపతి, కాగితాపల్లి కృష్ణారావు, కొత్తకోట ఆంజనేయులు, చెప్పల రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి..



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకుడు సింహాచలం, తదితరులు

వీరఘట్టం: మూడేళ్ల కిందట చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించారు. అయితే విస్తరణ పనులు పూర్తయి ఏడాది కావస్తున్నా ఇంతవరకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని కేవీపీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు ఎన్. సింహాచలం, తదితరులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ చందక సత్యనారాయణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు



గంగమ్మపేటలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ రవి, తదితరులు

వీరఘట్టం: పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ జి.రవి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కుంబిడి–ఇచ్ఛాపురం, గంగమ్మపేట గ్రామాల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ, పంచాయతీరాజ్ ఏఈ డి.కళ్యాణి దుర్గ, హౌసింగ్ ఏఈ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం.వసంత్‌కుమార్ ఉన్నారు.

● పక్కాగా పదో తరగతి పరీక్షలు



అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు తేహరా సుల్తానా

● రాష్ట్ర పరిశీలకురాలు తేహరా సుల్తానా

పాలకొండ రూరల్: పదో తరగతి పరీక్షలను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకురాలు తేహరా సుల్తానా అన్నారు. పట్టణంలో పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా ఒక బెంచ్‌కు ఒకరు కూర్చునేలా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరును డిప్యూటీ డీఈఓ పద్రి కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కురుటి సోంబాబు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

పాలకొండ: నగర పంచాయతీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం స్థానిక పంచయాతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఐద్వా నాయకుడు డి.రమణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ బల్బులు లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర పంచాయతీ ప్రజలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

గరుగుబిల్లి: రేషన్‌కార్డులో వున్న లబ్ధిదారులంతా తప్పనిసరిగా ఆయా గ్రామాలలోని రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల తహసీల్దార్ పి.బాల తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల పరిధిలోని రేషన్‌కార్డు లబ్ధిదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్డులలో వున్న సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవాలని, లేదంటే ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలు అందవన్నారు. ఈ విషయాన్ని రేషన్‌కార్డు లబ్ధిదారులంతా గమనించాలన్నారు.

నేటి నుంచి శిక్షణ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ సిబ్బందికి గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ బి.సిమ్మాలమ్మ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటల నుంచి ఎంపీడీఓ, ఐసీడీఎస్ కార్యాలయాల వేదికగా పోషణ–బి, పడాయి–బి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యకర్తలు శతశాతం హాజరుకావాలని సూచించారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

సీతంపేట: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసులు, కప్పులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వసంతలక్ష్మి మాట్లాడుతూ.. 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 647 మంది విద్యార్థినులకు వీటిని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు.

సునీతావిలియమ్స్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జియ్యమ్మవలస: అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఐఎస్ఎస్‌లో వివిధ పరిశోధనలు చేసి విజయవంతంగా భూమికి తిరిగివచ్చిన సునీతా విలియమ్స్ చిత్రపటానికి పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి విద్యార్థులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది మాట్లాడుతూ 9 నెలలు అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో పరిశోధనలు చేసి విజయవంతంగా భూమికి చేరుకున్న సందర్భంగా ఆమెకు ఘనంగా పాలాభిషేకం చేశారు. ఇలాంటి అంతరిక్ష యాత్రలు విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.



సునీతా విలియమ్స్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థులు

అంగన్‌వాడీల్లో అన్నప్రాసన కార్యక్రమం

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రాసనకు అవసరమైన సామగ్రిని అంగన్‌వాడీ కేంద్ర వర్కర్ చింతాడ గౌరమ్మ సమకూర్చారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి సూచనల మేరకు అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపడుతున్నట్లు అంగన్‌వాడీ కేంద్రం వర్కర్ తెలిపారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.



పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

పాలకొండ: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని సమస్యలు, ఇతర పరిస్థితులపై సమీక్షించారు. రీసర్వేకు సంబంధించి వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో అలసత్వం వహించరాదని సూచించారు. ఆయనతో పాటు డీటీ సన్యాసిరావు ఉన్నారు.

పరీక్ష కేంద్రం సందర్శన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే డిప్యూటీ ఈఓ ప్రసన్నకుమార్ దోనుబాయి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.



పరీక్ష కేంద్రంలో పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

కొమ్మలు కత్తిరిస్తే అధిక పూత



భామిని: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖాధికారి రాజశ్రీ

సీతంపేట: జీడిమామిడి చెట్ల కొమ్మలు కత్తిరిస్తే అధిక పూత వస్తుందని రస్తా కుంటుబాయి కేవీకే సైంటిస్ట్ శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని దిగువకలువరాయి, తదితర గ్రామాల్లో రైతులకు కొమ్మ కత్తిరింపుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమ్మలు కత్తిరిస్తే సూర్యరష్మి బాగా తగులుతుందన్నారు. టీదోమ వ్యాప్తి బాగా తగ్గాలంటే వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. జీడి పునరుద్ధరణలో భాగంగా ఖాళీల్లో కొత్త మొక్కలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ పేడాడ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకోవాలి

భామిని: జీడి మామిడి రైతులు ఆదాయం పెంచుకోవడంపై దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని బొద్దగూడలో సీతంపేట ఉద్యానవన శాఖాధికారి పేడాడ రాజశ్రీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో జీడిమామిడిలో పూత పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. కొమ్మలు కత్తిరించి, వేప నూనె పిచికారీ చేస్తే టీ దోమ వ్యాప్తి తగ్గి పూత బాగా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఏ అలికాన ఎర్రన్న, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలి : డీపీఓ

గరుగుబిల్లి: పారిశుద్ధ్య నిర్వాహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని కొంకడివరం, కొత్తపల్లి, గొట్టివలస తదితర గ్రామాలలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను, గ్రామంలోని పారిశుధ్యంను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డ్‌లకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారుచేయడం జరుగుతుందన్నారు. సేంద్రీయ ఎరువులతో పంటలను పండిస్తే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తయారవుతాయన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలన్నారు. పారిశుద్ధ్యం బాగా వుంటే ఆరోగ్యవంతమైన సమాజం తయారుచేయవచ్చునన్నారు. మన ఆరోగ్యం మన చేతులలోనే వుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈయనతో పాటు ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ

అవగాహన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో అగ్నిప్రమాదాలపై స్థానిక అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అవగాహన కల్పించారు. డ్రై కెమికల్ పౌడర్, ఫైర్ యంత్ర పరికరాల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.చంద్రరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.